



# Dr.PRK పవర్

పోరాడితే పోయిదేమి లేదు బానిస సంకెళ్ళు తప్ప








సంపుటి : 01 సంచిక : 356 | ఆదివారం 4 అక్టోబర్ 2026 | పేజీలు : 4 | వెల : 4


# ఆసుపత్రుల నిర్మాణాల్లో వేగం పెంచండి

## నిర్మాణం పూర్తయ్యే నాటికి... సిబ్బంది కొరత ఉండకూడదు

### సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

### అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉండాలి

### ప్రతివారం పురోగతిపై సమీక్ష నిర్వహించాలి



(హైదరాబాద్ - పవర్ దినపత్రిక, అక్టోబర్ 03

ఎల్బీనగర్, అల్వాల్, వరంగల్, ఉస్మానియా ఆస్పత్రుల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆస్పత్రుల్లో వైద్యులు, ఇతర సిబ్బంది అవసరాలను గుర్తించి నియామక ప్రక్రియను చేపట్టాలని సూచించారు. ఆస్పత్రుల నిర్మాణం పూర్తయ్యే నాటికి సిబ్బంది కొరత లేకుండా చూడాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) సంజయ్ జాజును ఆదేశించారు.

**అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉండాలి**

విద్య, వైద్య శాఖలపై సీఎంవో అధికారులతో సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి, అధికారులకు కీలక ఆదేశాలిచ్చారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అవసరమైన అత్యాధునిక పరికరాలను కొనుగోలు చేయాలని సూచించారు. ఆస్పత్రుల నిర్మాణం పూర్తయ్యేనాటికి అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

**ప్రతివారం సమీక్ష నిర్వహించాలి**

కలెక్టర్లతో పాటు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని సీఎం ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలు, సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్, ఆస్పత్రులను సందర్శించాల్సిందేనని స్పష్టం చేశారు. జిల్లాస్థాయిలో ప్రతీ వారం సమీక్ష నిర్వహించాలని నిర్దేశించారు. సీజనల్ వ్యాధులపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎం సూచించారు. పాఠశాలల్లో అవసరమైన చోట మరమ్మతు పనులను చేయాలన్నారు.

గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లు, అతిథులు, పెట్టుబడుల విషయంలో పకడ్బందీగా ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం సూచించారు. త్వరలోనే ఏర్పాట్లను పరిశీలిస్తానని చెప్పారు. ఈ సమీక్షలో ఎంపీ వేంనరేందర్‌రెడ్డి, సలహాదారు రామకృష్ణారావు, డీజీపీ సీవీ ఆనంద్, సీఎంవో ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



### పిల్లల ఆన్‌లైన్ భద్రతకు

# ప్రత్యేక ఫ్రేమ్‌వర్క్

### రేవంత్ రెడ్డి

**ఆన్‌లైన్‌లో పిల్లల సేఫ్టీ.. అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు.. మహిళలు, పిల్లల రక్షణే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని వెల్లడి**

**సైబర్ క్రైమ్‌కు 1930, చైల్డ్ హెల్ప్‌లైన్‌కు 1098 నంబర్లు గుర్తుంచుకోవాలని సూచన**

హైదరాబాద్, పవర్ న్యూస్

డిజిటల్ యుగంలో సైబర్ నేరాల నుంచి పిల్లలకు రక్షణ కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక చర్యలకు శ్రీకారం చుట్టింది. పిల్లల ఆన్‌లైన్ భద్రత కోసం ఒక సమగ్ర ఫ్రేమ్‌వర్క్‌ను వెంటనే రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లో జరిగిన నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (నల్సా) సౌత్ జోన్ రీజనల్ కాన్ఫరెన్స్‌లో ఆయన ఈ ఆదేశాలు జారీ చేశారు. ఆన్‌లైన్‌లో పిల్లలు ఎక్కువ సమయం గడుపుతున్నారని, అక్కడ ఎదురయ్యే ప్రమాదాలపై వారికి సరైన అవగాహన ఉండటం లేదని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో, తెలంగాణ హైకోర్టు, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థతో సంప్రదింపులు జరిపారు.



### ఆసియా క్రీడల్లో... భారత్‌కు

# పతకాల పంట

**క్రికెట్ లో పాకిస్తాన్‌పై 13 పరుగుల తేడాతో విజయం**

**21 స్వర్ణాలు సహా 85 పతకాలు**

**4వ స్థానంలో నిలిచిన భారత్**

**చివరిరోజూ భారత్‌కు పథకాల పంట**

**ముగిసిన జపాన్ ఆసియా క్రీడలు**

న్యూఢిల్లీ, పవర్ న్యూస్

రెండు రోజుల క్రితం పతకాల పట్టికలో భారత్ టాప్-10లో కూడా లేదు. తర్వాత పుంజుకొని టాప్-5లోకి దూసుకొచ్చింది. ఆరంభంలో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయినా.. చివరి రెండు రోజుల్లో భారత క్రీడాకారులు అద్భుతాలు చేశారు. వరుసగా స్వర్ణాలు సాధిస్తూ పతకాల వేటలో కొత్త ఊపు తీసుకొచ్చారు. హాకీ, క్రికెట్ నుంచి ఆర్చరీ, బాక్సింగ్, రెజ్లింగ్ వరకు సత్తా చాటారు. మొత్తంగా 21 స్వర్ణాలు సహా 85 పతకాలతో ఆసియా క్రీడల ప్రస్థానాన్ని 4వ స్థానంతో ముగించారు. కొన్ని విభాగాల్లో నిరాశ ఎదురైనా మరికొన్ని క్రీడల్లో సరికొత్త చరిత్ర సృష్టించారు. ఆసియా క్రీడల్లో భారత్ ప్రస్థానం ఒడుదొడుకులతో సాగింది. గురువారం నాటికి ఖాతాలో 10 స్వర్ణాలు మాత్రమే ఉన్నాయి. పతకాల పట్టికలో టాప్-10 కింద నిలిచింది. అయితే చివరి రెండు రోజుల్లో సీన్ మారిపోయింది. క్రికెట్, హాకీ జట్లు పసిడి పతకాలు సాధించాయి. ఆర్చరీ, బాక్సింగ్, రెజ్లింగ్‌లోనూ భారత క్రీడాకారులు మెరిశారు. దీంతో చివరి రెండు రోజుల్లోనే మరో 11 స్వర్ణాలు ఖాతాలో చేరాయి. భారత్ టాప్-5లోకి దూసుకొచ్చింది. ఈసారి భారత హాకీ జట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మహిళల జట్టు 44 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ స్వర్ణం గెలుచుకుంది. పురుషుల జట్టు కూడా మలేసియాపై 5-1తో ఘన విజయం సాధించి టైటిల్‌ను నిలబెట్టుకుంది. ఒకే ఆసియా క్రీడల్లో పురుషులు, మహిళల జట్లు స్వర్ణాలు గెలవడం ఇదే తొలిసారి. ఈ విజయాలతో రెండు జట్లూ 2028 లాస్‌ఏంజెల్స్ ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సాధించాయి. క్రికెట్‌లోనూ పురుషులు, మహిళలు స్వర్ణాలు గెలిచి భారత్ ఖాతాలో పసిడి పతకాలు జమ చేశారు. కబడ్డీలోనూ ఇరు జట్లు స్వర్ణ విజేతలుగా నిలిచాయి. ఆర్చరీలో భారత క్రీడాకారులు అద్భుత ప్రదర్శన చేశారు.

# గవర్నర్ కోటాలో డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణకు ఎమ్మెల్సీ ఇవ్వాలి

### - మాదిగలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలి - బరుపట్ల అయోధ్య, సంగే మహేందర్, కొయ్యడ దేవరాజ్ పరి రాజేష్




(హనుమకొండ - పవర్,అక్టోబర్ 03 2026): మాదిగ సామాజిక వర్గానికి రాజకీయ ప్రాతినిధ్యం పెంచే దిశగా ప్రముఖ వైద్యులు, ప్రజాసేవకులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ మాదిగకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ అవకాశం కల్పించాలని హన్మకొండ కాంగ్రెస్ నాయకులు బరుపట్ల అయోధ్య, సంగే మహేందర్, కొయ్యడ దేవరాజ్ పరి రాజేష్ డిమాండ్ చేశారు.గాంధీ భవన్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో వారు మాట్లాడుతూ, డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ ఎన్నో సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ ప్రజా సమస్యలు, దళిత--బహుజన వర్గాల సంక్షేమం కోసం పనిచేస్తున్నారని తెలిపారు.బరుపట్ల అయోధ్య మాట్లాడుతూ, ఎన్ఎస్‌యూఐ కార్యకర్తగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన డాక్టర్ రామకృష్ణ పార్టీ కోసం నిరంతరం కష్టపడ్డారని అన్నారు. గతంలో ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో టికెట్ అవకాశం రాకపోయినా కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి తనకు టికెట్ వచ్చినప్పుడు ఎంత కష్టపడతారో అదే స్థాయిలో పనిచేశారని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎన్నో ఇబ్బందులు, కేసులు ఎదురైనా పార్టీని వీడకుండా కాంగ్రెస్‌లోనే కొనసాగిన ఆయన నిబద్ధతను పార్టీ నాయకత్వం గుర్తించాలని కోరారు. డాక్టర్ రామకృష్ణ చారిటబుల్ ట్రస్టు ద్వారా పేదలు, బలహీన వర్గాలకు వైద్య, సామాజిక సేవలు అందిస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్నారని అయోధ్య తెలిపారు. ప్రజాసేవకు అంకితమై తన వైద్య వృత్తిని సైతం పక్కనపెట్టి సేవా కార్యక్రమాల్లో కొనసాగుతున్న ఆయనకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ అవకాశం కల్పించడం ద్వారా మాదిగలతో పాటు పేదలు, దళిత--బహుజన వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం లభిస్తుందని అన్నారు.సంగే మహేందర్ మాట్లాడుతూ, డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణకు ఎమ్మెల్సీ అవకాశం కల్పించాలని కోరుతూ ఇప్పటికే పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు మద్దతు తెలిపిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రజా సేవ, వైద్య సేవలు, సామాజిక ఉద్యమాల్లో ఆయన చేసిన కృషిని కాంగ్రెస్ అధిష్టానం పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.కొయ్యడ దేవరాజ్ పరి రాజేష్ మాట్లాడుతూ, పేదలు, దళితులు, బహుజనుల సమస్యలపై నిరంతరం స్పందించే డాక్టర్ రామకృష్ణకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ అవకాశం కల్పిస్తే సామాజిక న్యాయానికి మరింత బలం చేకూరుతుందని అన్నారు. పార్టీ కోసం ఎన్నో సంవత్సరాలుగా పనిచేస్తున్న నాయకుడికి తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డితో పాటు కాంగ్రెస్ అధిష్టానం పెద్దలను కోరారు.

కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని ఏకగ్రీవంగా విజ్ఞప్తి చేశారు. ఆయన సేవలను, పార్టీ పట్ల నిబద్ధతను, సామాజిక రంగంలో చేసిన కృషిని పరిగణనలోకి తీసుకొని తగిన అవకాశం కల్పించాలని కోరారు.ఈ ప్రెస్‌మీట్‌లో హన్మకొండ కాంగ్రెస్ నాయకులు బరుపట్ల అయోధ్య, సంగే మహేందర్, కొయ్యడ దేవరాజ్ పరి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# పిల్లల రక్షణకు తెలంగాణ ప్రభుత్వం సంపూర్ణ సహకారం




## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

(హైదరాబాద్ – పవర్ దినపత్రిక , అక్టోబర్ 03 2026) :

?పిల్లలు ఆన్‌లైన్ వేధింపులు మరియు సైబర్ నేరాల బారిన పడకుండా వారి భద్రత కోసం న్యాయ సేవల ప్రాధికార సంస్థ అందించే సూచనలు మరియు కార్యక్రమాలకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి మద్దతునిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. డిజిటల్ వేదికలపై పిల్లల రక్షణ వ్యవస్థలను బలోపేతం చేయడానికి న్యాయసేవల సంస్థలు చేపడుతున్న కార్యక్రమాలను ప్రతి గ్రామానికి చేర్చడంలో ప్రభుత్వం సంపూర్ణంగా సహకరిస్తుందని స్పష్టం చేశారు.జాతీయ న్యాయ సేవా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో డిజిటల్ వేదికలపై పిల్లలకు రక్షణ, సులభంగా న్యాయం అందించడం మరియు ఆన్‌లైన్ లైంగిక వేధింపులను అరికట్టడం అనే ఇతివృత్తంపై హైదరాబాద్‌లో దక్షిణాది ప్రాంతీయ సదస్సు ప్రారంభమైంది. ఈ సదస్సుకు కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘూవాల్, సుప్రీంకోర్టు న్యాయమూర్తి, నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ జస్టిస్ విక్రమ్ నాథ్, పలువురు సుప్రీంకోర్టు మరియు హైకోర్టుల న్యాయమూర్తులు హాజరయ్యారు.మహిళలు మరియు పిల్లల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యతనిస్తోందని, భరోసా కేంద్రాలు, చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్లు మరియు ప్రత్యేక కోర్టులు వంటి అనేక వ్యవస్థలు పనిచేస్తున్నాయని ముఖ్యమంత్రి తెలిపారు.

దేశంలోనే తొలి చైల్డ్ ఫ్రెండ్లీ కోర్టును హైదరాబాద్‌లో ఏర్పాటు చేశామని, సైబర్ ల్యాబ్‌ల ద్వారా విద్యార్థులు మరియు ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ భద్రతపై అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

?విద్యార్థులను సైబర్ అంబాసిడర్లుగా తయారు చేసి తోటి వారికి అవగాహన కల్పిస్తున్నామని, ఇప్పటివరకు మూడు వేల మందికి పైగా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులకు శిక్షణ ఇచ్చామని వెల్లడించారు. సైబర్ నేరాల నియంత్రణ కోసం కేటాయించిన నంబరును మరియు చైల్డ్ హెల్ప్‌లైన్ నంబరును పిల్లలు మరియు తల్లిదండ్రులు తప్పక గుర్తుంచుకోవాలని సూచించారు. న్యాయం అంటే కేవలం నేరస్తుడికి శిక్ష పడటం కాదని, బాధితుడి జీవితాన్ని మరియు పిల్లలు కోల్పోయిన బాల్యాన్ని తిరిగి అందించడమేనని ఉద్ఘాటించారు.

కార్యక్రమంలో భాగంగా న్యాయ సేవల ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉచిత న్యాయ సేవల కోసం సిద్ధం చేసిన సంచార లోక్ అదాలత్ వాహనాలను కేంద్ర మంత్రి మరియు న్యాయమూర్తుల సమక్షంలో ముఖ్యమంత్రి ప్రారంభించారు.

**ఇర్సడ్ల వంశీకృష్ణ**
**స్టేట్ బ్యూరో చీఫ్ పవర్ దినపత్రిక**

## మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను కలిసిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి

(హైదరాబాద్ – పవర్ దినపత్రిక, అక్టోబర్ 03 2026)

హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ గిరిజన సంక్షేమం, సాంఘిక సంక్షేమం, మైనారిటీ సంక్షేమం, వికలాంగులు, వయోవృద్ధులు మరియు ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సాధికారత శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను పాలకుర్తి శాసనసభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో వివిధ అంశాలపై స్నేహపూర్వకంగా చర్చించారు. పాలకుర్తి నియోజకవర్గానికి సంబంధించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై కూడా చర్చ జరిగినట్లు తెలిపారు.

ఈ మర్యాదపూర్వక భేటీలో పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకుని, నియోజకవర్గ ప్రజల సంక్షేమం మరియు అభివృద్ధి కోసం సమన్వయంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.



# గౌరవెల్లి ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని మంత్రుల ఆదేశం

(హైదరాబాద్ – పవర్ దినపత్రిక, అక్టోబర్ 03 2026)

గౌరవెల్లి రిజర్వాయర్ ప్రాజెక్టు పనులను వేగవంతం చేసి నిర్దేశిత లక్ష్యాల మేరకు పూర్తి చేయాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. సచివాలయంలో శనివారం గౌరవెల్లి ప్రాజెక్టు పనుల పురోగతిపై ఉన్నతాధికారులతో వారు సమీక్ష సమావేశం నిర్వహించారు. భూసేకరణ, పునరావాసం, పర్యావరణ అనుమతులు, కాలువల పనులు, సవరించిన అంచనాలు, నీటి నిల్వలు తదితర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.రెండు వేల ఏడులో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చేతుల మీదుగా గౌరవెల్లి రిజర్వాయర్‌కు శంకుస్థాపన జరిగినట్లు అధికారులు మంత్రులకు వివరించారు. రెండు వేల పదమూడు నాటికి సుమారు యాభై ఏడు శాతం పనులు పూర్తయ్యాయని, అనంతరం వివిధ పరిపాలనా కారణాలతో భూసేకరణలో జాప్యం జరిగిందని తెలిపారు. రెండు వేల ఇరవై మూడులో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భూసేకరణపై ప్రత్యేక దృష్టి సారించడంతో గణనీయమైన పురోగతి సాధించినట్లు వెల్లడించారు. మిగిలిన భూసేకరణను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రులు ఆదేశించారు.గౌరవెల్లి రిజర్వాయర్ కోసం భూములు కోల్పోయిన రైతులకు ఎకరాకు పదిహేడు లక్షల రూపాయల చొప్పున పరిహారం అందించేందుకు చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న భూసేకరణ సమస్యలను త్వరగా పరిష్కరించాలని మంత్రులు సూచించారు. వివాహిత కుమార్తెలకు పునరావాస ప్రయోజనాలు కల్పించడం, పాత, కొత్త ముంపు ప్రాంతాల్లోని కుటుంబాలకు సంబంధించిన అంశాలపైనా సమావేశంలో చర్చించారు. కాలువలకు సంబంధించిన భూసేకరణ పురోగతిని కూడా సమీక్షించారు. ఇప్పటికే పెద్ద మొత్తంలో నిధులు విడుదల చేసి లబ్ధిదారులకు పరిహారం చెల్లింపులు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. మిగిలిన భూసేకరణను వేగంగా పూర్తి చేసి కాలువల పనులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని మంత్రులు ఆదేశించారు.ప్రాజెక్టుకు సంబంధించిన తాజా పర్యావరణ అనుమతులపైనా సమావేశంలో చర్చ జరిగింది. కేంద్ర సంస్థల మార్గదర్శకాలకు అనుగుణంగా అవసరమైన అనుమతులు పొందేందుకు చర్యలు చేపడుతున్నామని అధికారులు తెలిపారు. భూసేకరణ, పునరావాసం, ధరల పెరుగుదల తదితర కారణాలతో గౌరవెల్లి




రిజర్వాయర్, కాలువలకు సంబంధించిన సవరించిన అంచనాలను ప్రభుత్వానికి సమర్పించినట్లు వెల్లడించారు. మిగిలిన పనులకు పరిపాలనా అనుమతులు వచ్చిన వెంటనే టెండర్ల ప్రక్రియ చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. ఎంఎంఆర్ ప్యాకేజీ మూడు పనులకు సంబంధించిన సవరించిన అంచనాలు, అదనపు నిర్మాణాల ప్రతిపాదనలు, భవిష్యత్ కార్యాచరణపై కూడా మంత్రులు సమీక్షించారు.అవసరమైన పర్యావరణ, ఇతర ప్రభుత్వ అనుమతులు పొందిన వెంటనే ప్రాజెక్టు పనులను వేగంగా ముందుకు తీసుకెళ్లాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. భూసేకరణ, పునరావాసం, అనుమతులకు సంబంధించిన పెండింగ్ అంశాలను నీటిపారుదల, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో పరిష్కరించాలని సూచించారు.ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ కార్యదర్శి ఇ శ్రీధర్, భూసేకరణ, పునరావాస కమిషనర్ శివకుమార్ నాయుడు, ఈఎన్‌సీ జనరల్ రమేష్ బాబు, ఈఎన్‌సీ ఓఅండ్ఎం మధుసూదన్‌రావు, జాయింట్ సెక్రటరీ కె శ్రీనివాస్‌తో పాటు మూడు జిల్లాలకు చెందిన అధికారులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు

## హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలిగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య నియామకం

(హనుమకొండ – పవర్ దినపత్రిక, అక్టోబర్ 03 2026)



వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్యకు పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఆన్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ రెండు వేల ఇరవై ఆరు నుంచి రెండు వేల ఇరవై ఏడు సంవత్సరాలకు సంబంధించి సభ్యురాలిగా మరోసారి అవకాశం లభించింది. రెండు వేల ఇరవై ఆరు సెప్టెంబర్ ఇరవై ఆరు నుంచి ఈ కమిటీలో ఎంపీ డాక్టర్ కడియం కావ్య సభ్యురాలిగా నామినేట్ అయినట్లు రాజ్యసభ సెక్రటేరియట్ అధికారికంగా తెలియజేసింది.ఈ మేరకు రాజ్యసభ సెక్రటేరియట్ డైరెక్టర్ భూపేంద్ర భాస్కర్ అక్టోబర్ మూడున ఎంపీ డాక్టర్ కడియం కావ్యకు అధికారిక లేఖ పంపారు.


भारतीय संसद
PARLIAMENT OF INDIA
राज्य सभा सचिवालय
RAJYA SABHA SECRETARIAT

संसद भवन परिसर,
नई दिल्ली - 110001.
वेबसाइट : https://sansad.in/rs/hi

Parliament House Complex,
New Delhi – 110001.
website : https://sansad.in/rs

No. LAFEAS-HF11011/1/2026-H and FW-RSS — Dated the 3rd October, 2026

To
Dr. Kadiyam Kavya
M.P. (Lok Sabha)

Subject: *Nomination to the Department-related Parliamentary Standing Committee on Health and Family Welfare (2026-27)-reg.*

Madam,

I am directed to inform that in terms of the provisions of sub-rule (1) of Rule 269 of the Rules of Procedure and Conduct of Business in the Council of States (Rajya Sabha), you have been nominated to be a Member of the Department-related Parliamentary Standing Committee on Health and Family Welfare *w.e.f.* 26th September, 2026.

2. A list of Members of the Committee and a background note on the Committee are enclosed for information.

3. You are requested to kindly fill up the requisite details in the enclosed proforma and forward the same to this Secretariat for further necessary action. The filled up proforma can also be sent to the e-mail address: rs-chfw@rss.sansad.in.

Yours sincerely,

(BHUPENDRA BHASKAR)
DIRECTOR (H&FW) & DY. CVO
Tel- 011-2303-4034/5779(O)
E-mail: bhupendra.bhaskar@rss.sansad.in
E-mail Section: rs-chfw@rss.sansad.in

వైద్యురాలిగా, ఎంపీగా ప్రజారోగ్య అంశాలపై మరింత కృషి చేస్తున్న వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య క్యాన్సర్ స్క్రీనింగ్, ఆధునిక వైద్య సాంకేతికత, ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.ఇప్పటికే ప్రజారోగ్యానికి సంబంధించిన పలు అంశాలను డాక్టర్ కడియం కావ్య పార్లమెంట్‌లో ప్రస్తావించారు. ముఖ్యంగా పారాక్వాట్ డైక్లోరైడ్ గడ్డి మందుపై దేశవ్యాప్తంగా నిషేధం విధించాలని రెండు వేల ఇరవై ఆరు మార్చి ఇరవై ఏడున లోక్‌సభలో ప్రత్యేక ప్రస్తావన ద్వారా కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. పారాక్వాట్ వినియోగం వల్ల కలుగుతున్న ఆరోగ్య ప్రమాదాలను ప్రస్తావిస్తూ ప్రజల ప్రాణాలను కాపాడేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని ఎంపీ డాక్టర్ కడియం కావ్య కోరారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం గడ్డి మందును పూర్తిగా నిషేధించింది. అదేవిధంగా క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించేందుకు స్క్రీనింగ్ కార్యక్రమాలను మరింత విస్తృతం చేయడం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం, కృత్రిమ మేధస్సు ఆధారిత వైద్య విధానాలను ప్రోత్సహించడం వంటి అంశాలపై కూడా డాక్టర్ కడియం కావ్య ప్రత్యేకంగా దృష్టి సారించారు.క్యాన్సర్ చికిత్స కంటే ముందుగా క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తించడం ద్వారా ప్రాణాలను కాపాడే అవకాశాలు పెరుగుతాయని, గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాల్లో కూడా నాణ్యమైన క్యాన్సర్ స్క్రీనింగ్ అందుబాటులోకి రావాల్సిన అవసరం ఉందని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. ముఖ్యంగా మహిళలు, గ్రామీణ ప్రజలు మరియు ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు సులభంగా స్క్రీనింగ్ అందేలా జాతీయ స్థాయిలో మరింత బలమైన వ్యవస్థ అవసరమని ఎంపీ కోరుతున్నారు.క్యాన్సర్ స్క్రీనింగ్‌పై కేంద్రం ప్రత్యేక దృష్టి పెట్టాలని హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిటీలో తనకు అవకాశం కల్పించినందుకు డాక్టర్ కడియం కావ్య కేంద్ర ప్రభుత్వానికి, పార్లమెంట్‌కు కృతజ్ఞతలు తెలిపారు.వైద్యురాలిగా తనకు ఎంతో దగ్గరైన ప్రజారోగ్య రంగంలో పార్లమెంటరీ స్థాయిలో మరింత బాధ్యతగా పనిచేసే అవకాశం లభించడం సంతోషంగా ఉందని అన్నారు. ముఖ్యంగా క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించేలా దేశవ్యాప్తంగా క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఆధునిక సాంకేతికత, కృత్రిమ మేధస్సు ఆధారిత స్క్రీనింగ్ మరియు డయాగ్నస్టిక్ విధానాలను అందుబాటులోకి తీసుకురావడంపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు కూడా అత్యాధునిక వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నానని ఎంపీ డాక్టర్ కడియం కావ్య తెలిపారు.ప్రజారోగ్యం, వ్యాధుల నివారణ, క్యాన్సర్ స్క్రీనింగ్, ఆధునిక వైద్య సాంకేతికత, వైద్య సేవల అందుబాటు, ఆరోగ్య మౌలిక వసతుల బలోపేతం వంటి అంశాలను కమిటీ ద్వారా జాతీయ స్థాయిలో మరింత బలంగా ప్రస్తావించేందుకు కృషి చేస్తానని ఎంపీ డాక్టర్ కడియం కావ్య తెలిపారు. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజల తరపున పార్లమెంట్‌లో ఆరోగ్య హక్కు కోసం మరింత బలంగా తన గళం వినిపిస్తానని ఎంపీ డాక్టర్ కడియం కావ్య స్పష్టం చేశారు.

# పార్టీలకు అతీతంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో అభివృద్ధి పనుల శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

(హనుమకొండ -- పవర్ దినపత్రిక, అక్టోబర్ 03, 2026)



వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో పార్టీలకు అతీతంగా ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన గడిచిన 33 నెలల్లో నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు.

శనివారం 31వ డివిజన్ పరిధిలోని అవంతి స్కూల్ కాలనీ, హంటర్ రోడ్ విశాల్ మార్ట్ ఆవరణ, సూర్యోదయ కాలనీ, శ్రీరామ్ హిల్స్, హంటర్ హిల్స్ రోడ్ నంబర్ 3 ప్రాంతాల్లో సుమారు రూ.2.60 కోట్లతో చేపట్టనున్న అంతర్గత రోడ్లు, సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే నాయిని శంకుస్థాపన చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కాలనీ ప్రజలు, సంబంధిత అధికారులతో కలిసి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ ప్రజల అవసరాలను గుర్తించి ప్రతి డివిజన్‌లో ప్రాధాన్యత క్రమంలో రోడ్లు, డ్రైనేజీలు, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయిస్తోందన్నారు. నియోజకవర్గంలో ఇప్పటికే చేపట్టిన అభివృద్ధి పనులతో పాటు అవసరమైన ప్రాంతాల్లో కొత్త పనులను కూడా వేగంగా చేపడుతున్నామని తెలిపారు.ప్రజల అభ్యున్నతి, నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే ప్రజా ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అభివృద్ధి పనులు జరుగుతుండటాన్ని చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు ప్రజలను తప్పుదోవ పట్టించేలా తప్పుడు ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని, క్షేత్రస్థాయిలో జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రజలు స్వయంగా పరిశీలించాలని కోరారు. నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే నాయిని తెలిపారు. అభివృద్ధి పనుల నాణ్యత విషయంలో రాజీ లేకుండా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పీసీసీ మెంబర్ బత్తిని శ్రీనివాస్ రావు, డివిజన్ ఇంచార్జ్ మార్క విజయ్ కుమార్, మాజీ కార్పొరేటర్ మామిండ్ల రాజు, వేల్పుల మోహన్ రావు, జిల్లా నాయకులు సురేష్, డివిజన్ అధ్యక్షుడు సత్తు రమేష్, మాజీ అధ్యక్షులు సురేందర్, నాయకులు వేణు, కృష్ణ, అభిలాష్ స్థానిక నాయకులు, కార్యకర్తలు, అధికారులు, కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# ప్రమాదంలో మృతి చెందిన లింగాల కేదారి కుటుంబానికి రూ.10 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేసిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

(హనుమకొండ - పవర్ దినపత్రిక, అక్టోబర్ 03 2026)



ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందిన లింగాల కేదారి మరియు పుష్పలత దంపతుల కుటుంబానికి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎ రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరు చేసిన పది లక్షల రూపాయల ఆర్థిక సాయం చెక్కును శనివారం అందజేశారు.

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే శ్రీ కేఆర్ నాగరాజు, డీసీసీ అధ్యక్షులు శ్రీ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి కేదారి కుటుంబ సభ్యుల ఇంటికి వెళ్లి చెక్కును అందజేసి, కుటుంబాన్ని పరామర్శించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో ఆనాటి ఉద్యమకారులకు ఆపన్నహస్తం అందిస్తూ అండగా నిలిచిన లింగాల కేదారి సేవలను తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం గుర్తించి, ఆయన కుటుంబానికి ఆర్థిక చేయూత అందించిందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమ సమయంలో పోరాడిన ఉద్యమకారులను ప్రజా ప్రభుత్వం గౌరవిస్తుందని, రానున్న రోజుల్లోనూ ఉద్యమంలో పాల్గొని పోరాటం చేసిన ప్రతి ఒక్కరికీ అండగా నిలుస్తుందని అన్నారు.

కేదారి కుటుంబం ప్రస్తుత కష్టకాలంలో తాను వ్యక్తిగతంగా కూడా అండగా ఉంటానని, తన వంతుగా కుటుంబ సభ్యులను అన్ని విధాలుగా ఆదుకుంటానని ఎమ్మెల్యే నాయిని భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి, ఆపదలో ఉన్న కుటుంబాలను ఆదుకోవడానికి కట్టుబడి ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# మహిళా సంఘాల ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

## ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

(సంగెం - పవర్ దినపత్రిక, అక్టోబర్ 03 2026)

సంగెం మండలం తీగరాజుపల్లి గ్రామంలో సంగెం సంగమేశ్వర ఉమెన్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్మించనున్న ఫుడ్ గ్రెయిన్ స్టోరేజ్ గోదాం నిర్మాణానికి వరంగల్ జిల్లా కలెక్టర్ శ్రీమతి సత్య శారదతో కలిసి పరకాల శాసనసభ్యులు శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి, రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని సురక్షితంగా నిల్వ చేసుకునేందుకు ఈ గోదాం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి శ్రీ ఎ రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు.ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. దామరలో మహిళలతో పరకాల ఇందిరా మహిళా డైరీ ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. మహిళా సంఘాల ద్వారా పాడి పరిశ్రమను మరింత బలోపేతం చేసి, గ్రామీణ మహిళలకు స్థిరమైన ఉపాధి, ఆర్థిక స్వావలంబన కల్పిస్తామని చెప్పారు. ప్రతి క్లస్టర్‌లో ఫుడ్ గ్రెయిన్ స్టోరేజ్ గోదాంలను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.



# కామారం గ్రామ అభివృద్ధిలో మరో ముందడుగు

(ఆత్మకూర్ - పవర్ దినపత్రిక,అక్టోబర్ 03 2026)




ఆత్మకూరు మండలంలోని కామారం గ్రామం గత కొంతకాలంగా అభివృద్ధి దిశగా వేగంగా ముందుకు సాగుతోంది. గ్రామ ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చే దిశగా సర్పంచ్ శ్రీమతి తోట లక్ష్మీ కుమారస్వామి చేస్తున్న కృషిపై గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సొంత నిధులతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టడం జరిగింది. ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి స్కూల్ బ్యాగులు, వాటర్ ప్యూరిఫికేషన్, విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనతో పాటు పాఠశాల గ్రౌండ్‌ను మెరుగుపరిచే చర్యలు చేపట్టడం జరిగింది.తాజాగా బూర రాజయ్య తాత ఇంటి వద్ద నుంచి రోడ్డు పక్కన ఉన్న స్మశానవాటిక, అక్కడి నుంచి ఊరు బయట స్మశానవాటిక మీదుగా పెద్దమ్మతల్లి దేవాలయం వరకు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి లైటింగ్ సౌకర్యం కల్పించడం జరిగింది. దీంతో రాత్రి వేళల్లో ఆ మార్గంలో వెళ్లే ప్రజలకు చీకటి ఇబ్బందులు తొలగి, సురక్షితమైన ప్రయాణానికి సౌకర్యం కలగనుంది. గ్రామానికి ఇరువైపులా విద్యుత్ స్తంభాలతో లైటింగ్ ఏర్పాటు చేయడంపై గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.ఇదే విధంగా ఆత్మకూరు గ్రామ సర్పంచ్ శ్రీమతి పర్వతగిరి మహేశ్వరి రాజు కూడా చొరవ తీసుకుని, రోడ్డు పక్కన ఉన్న స్మశానవాటిక నుంచి ఆత్మకూరు వరకు విద్యుత్ స్తంభాలు, లైటింగ్ ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటే రెండు గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. కామారం మరియు ఆత్మకూరు మధ్య రాత్రి వేళల్లో ప్రయాణించే ప్రజలకు వెలుతురు సౌకర్యం కలగడంతో పాటు, రెండు గ్రామాల అభివృద్ధికి ఇది మరో ముందడుగుగా నిలుస్తుందని ఇరు గ్రామాల ప్రజలు ఆశిస్తున్నారు. మాట ఇచ్చి పని చేసి చూపిస్తూ ఒక్కొక్క అడుగు ముందుకు వేస్తూ గ్రామం అభివృద్ధి వైపు పయనిస్తోంది. కామారం గ్రామ అభివృద్ధికి కృషి చేస్తున్న సర్పంచ్ శ్రీమతి తోట లక్ష్మీ కుమారస్వామికి గ్రామ ప్రజలు అభినందనలు తెలిపారు

# పెద్దాపూర్ గ్రామంలో బైరి మల్లయ్య మరియు ఎలుక నర్సయ్య కుటుంబాల పరామర్శ

(పెద్దాపూర్ - పవర్ దినపత్రిక, అక్టోబర్ 03 2026)

పెద్దాపూర్ గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన బైరి మల్లయ్య మరియు ఎలుక నర్సయ్య కుటుంబాలను పెద్దాపూర్ మాజీ సర్పంచ్ సావురే కమల రాజేశ్వర్ రావు పరామర్శించారు. వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ఆర్థిక సహాయం అందజేశారు.

ఈ కార్యక్రమంలో ఎలుకటి బాలరాజు, వేల్పుల గణేష్, ఎలుకటి రాజు, బొల్లోజు దయాకర్, కొమ్ముల ప్రవీణ్, పరుమండ్ల రాజు తదితరులు పాల్గొన్నారు.



# సహకార సంఘాల బలోపేతానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోంది

**ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి**

(సంగెం - పవర్ దినపత్రిక, అక్టోబర్ 03 2026)




సంగెం మండలం రామచంద్రపురం గ్రామంలో ఎఫ్ ఎస్ సి ఎస్ కాపులకనపర్తి సొసైటీ ఆధ్వర్యంలో నిర్మించిన రెండు వందల యాభై మెట్రిక్ టన్నుల ఎరువుల గోదాం మరియు షాపింగ్ కాంప్లెక్స్‌ను జిల్లా కలెక్టర్ శ్రీమతి సత్య శారదతో కలిసి పరకాల శాసనసభ్యులు శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ కాపులకానిపర్తి సొసైటీ అంటే తనకు ప్రత్యేక గౌరవం ఉందని అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం సహకార సంఘాల బలోపేతానికి ప్రత్యేకంగా కృషి చేస్తోందని తెలిపారు. సహకార వ్యవస్థ ద్వారా రైతుల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి మరిన్ని అవకాశాలు లభిస్తాయని అన్నారు. సొసైటీ పరిధిలోని వెయ్యి తొమ్మిది వందల ఏడుగురు రైతులకు పద్నాలుగు కోట్ల డెబ్బై ఏడు లక్షల రూపాయల రైతు రుణమాఫీ చేశామని అన్నారు. రైతుల ప్రయోజనాల కోసం పనిచేస్తున్న సహకార సంఘాలను బలోపేతం చేయడంతో పాటు, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు.

స్థానిక నాయకత్వం ఎంత బలంగా పనిచేస్తే, ప్రభుత్వం నుంచి అంతే స్థాయిలో ప్రోత్సాహం అందుతుందని అన్నారు. రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉండేలా ఈ గోదాం, సొసైటీ కార్యకలాపాలకు ఉపయోగపడేలా షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయడం అభినందనీయమని, సహకార సంఘాల ద్వారా రైతులకు మరింత మెరుగైన సేవలు అందేలా ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. మహిళల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక కార్యచరణ రూపొందిస్తుందని, రాష్ట్రంలో ప్రథమంగా మహిళలతో పరకాల ఇందిరా మహిళా డైరీ ఏర్పాటు చేస్తున్నామని అన్నారు.

ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని అన్నారు.

ఈ కార్యక్రమంలో డిసిఒ నీరజ, జిల్లా వ్యవసాయ అధికారి విజయభాస్కర్, సొసైటీ చైర్మన్ దొమ్మటి సంపత్, స్థానిక సర్పంచ్ పులి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

---

# అలీపురా బస్తీని సందర్శించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

(హనుమకొండ - పవర్ దినపత్రిక, అక్టోబర్ 03 2026)



వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని యాభై తొమ్మిదవ డివిజన్ అలీపురా బస్తీలో శనివారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి ఎర్రబెల్లి స్వర్ణతో కలిసి పర్యటించారు. అలీపురా బడే మసీదు ఆవరణలో స్థానిక పరిస్థితులను పరిశీలించి, ప్రజలకు అందుతున్న మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు.

ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న ముస్లిం కమ్యూనిటీ హాల్ అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. బస్తీలోని డ్రైనేజీ వ్యవస్థ, అంతర్గత రహదారులను పరిశీలించి, విద్యుత్ సమస్యలు, మరమ్మతులపై సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. పెండింగ్‌లో ఉన్న మరమ్మతులను సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు.

స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను గుర్తించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, సమస్యలపై నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు ఈవీ శ్రీనివాస్ రావు, టీపీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాస్ రావు, స్థానిక నాయకులు నవీన్, మజార్, తెల్ల కిషోర్, సుగుణ, శ్రుతి తదితర నాయకులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

---

## టీజీఎస్ఆర్టీసీ గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

(హనుమకొండ - పవర్ దినపత్రిక, అక్టోబర్ 03 2026)

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల నేపథ్యంలో హనుమకొండ, వరంగల్ పరిధిలోని ఆర్టీసీ డిపోల్లో ఎన్నికల ప్రచారంలో భాగంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు హనుమకొండ డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డితో కలిసి హనుమకొండ డిపో పరిధిలో ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు.



## తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారదను కలిసిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, ఝాన్సీ రాజేందర్ రెడ్డి

(హైదరాబాద్ - పవర్ దినపత్రిక, అక్టోబర్ 03 2026)

హైదరాబాద్‌లో ఇటీవల తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన నేరెళ్ల శారదను పాలకుర్తి శాసనసభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నేరెళ్ల శారదకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మహిళా హక్కుల పరిరక్షణ, వారి సంక్షేమం, సాధికారత కోసం తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఈ సందర్భంగా స్నేహపూర్వకంగా చర్చించారు. మహిళలకు అండగా నిలుస్తూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షిస్తూ నేరెళ్ల శారదకు ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, ఝాన్సీ రాజేందర్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.



---

# జయశ్రీకి న్యాయం చేయకుంటే ఆందోళనలు ఉధృతం

**టీఆర్పీ మహిళ ఉపాధ్యక్షురాలు సంగె స్వరూప హెచ్చరిక**

(హనుమకొండ - పవర్ దినపత్రిక, అక్టోబర్ 03 2026)



హన్మకొండ నగరంలోని యాభై రెండవ డివిజన్ రాంనగర్‌కు చెందిన గూడూరు జయశ్రీతో పాటు ఆమె మైనర్ కూతురు తేజస్వినిని ఆమె అత్త మీరాబాయి పన్నెండు రోజులుగా ఇంట్లో అక్రమంగా బంధించి వేధిస్తున్నా అధికారులు చూస్తూ ఊరుకోవడం సిగ్గుచేటు అని తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర మహిళ ఉపాధ్యక్షురాలు సంగెం స్వరూప ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం బాధితులను బంధించిన హన్మకొండలోని ఇంటి వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న నిరసనలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జయశ్రీని తన అత్త మీరాబాయి గతంలో కూడా వేధించారని, సుబేదారి పోలీసుల జోక్యంతో రెండు వేల పదహారులో ఆమెతో పాటు పిల్లలకు రాంనగర్‌లోని ఇల్లుతో పాటు ఇతర ఆస్తులను నోటరి డాక్యుమెంట్ ద్వారా రాసిచ్చారని తెలిపారు. కాగా పన్నెండు రోజుల క్రితం మీరాబాయి తన కూతుర్లు, అల్లుళ్లతో వచ్చి గుర్తు తెలియని వ్యక్తులను తీసుకొచ్చి జయశ్రీతో పాటు ఆమె కూతురు తేజస్వినిని ఇల్లు ఖాళీ చేయాలని బెదిరించగా వారు నిరాకరించడంతో ఇంట్లో ఉంచి తాళం వేసి బంధించారని అన్నారు. జయశ్రీకి ఇరవై నాలుగు గంటల్లో గతంలో రాసిచ్చిన ఇల్లుతో పాటు ఇతర ఆస్తులను ఇప్పించి న్యాయం చేయాలని, వెంటనే ఆమెను విడిపించాలని లేకుంటే హన్మకొండ కలెక్టరేట్, సీపీ కార్యాలయం ముందు ఆందోళనలు ఉధృతం చేస్తామని, రాస్తారోకోలు, ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. బాధితురాలిని నిర్బంధించిన మీరాబాయిపై వెంటనే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు తాటికొండ సద్గుణ, గట్టికొప్పుల రాములు, మోటపోతుల అభిజిత్, గట్టికొప్పుల పద్మ, సంగ సుగుణ, గూడూరు కార్తికేయ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలి

**జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి తుప్పరి నరసింహస్వామి**

(ఆత్మకూర్ - పవర్ దినపత్రిక, అక్టోబర్ 03 2026)



ఎస్సీ వర్గీకరణను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని, ఎస్సీ వర్గీకరణ రోస్టర్ పాయింట్లను సవరించాలని జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి తుప్పరి నరసింహస్వామి పిలుపునిచ్చారు. ఆత్మకూరు మండలంలోని నీరుకుల్లా గ్రామంలో ఎస్సీ వర్గీకరణ రోస్టర్ సవరణ సాధనకై చలో ఉస్మానియా యూనివర్సిటీలో జరిగే మహాసభ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను అశాస్త్రీయంగా విభజన చేసిందని, వెంటనే రద్దు చేయాలని లేనిపక్షంలో రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. సుప్రీంకోర్టు ఇచ్చిన గైడ్‌లైన్స్‌ను ఏమాత్రం పాటించకుండా ఏకపక్షంగా షమీమ్ అక్తర్ ఏకసభ్య కమిషన్ నిర్వహించి ఎస్సీ వర్గీకరణ చేపట్టి దళితుల మధ్య చిచ్చు పెట్టిందని, ఇది ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. దళితుల సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని చెబుతూనే, మరోపక్క వర్గీకరణ పేరుతో దళితుల మధ్య చిచ్చు పెట్టిందని ఆరోపించారు. ఇప్పటికైనా ఎస్సీ వర్గీకరణలో మాల కులానికి కేటాయించిన రోస్టర్ పాయింట్లను తగ్గించి, ప్రభుత్వ ఉద్యోగాల్లో న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు వంగేటి ప్రభాకర్, పసుల లక్ష్మీనారాయణ, నాంపల్లి శ్రీనివాస్, రవికుమార్, లక్ష్మణామూర్తి, న్యాతకాని వనయ్య తదితరులు పాల్గొన్నారు.

## భూపాలపల్లి బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధికార ప్రతినిధిగా మోత్కూరి సత్యనారాయణ నియామకం

(భూపాలపల్లి - పవర్ దినపత్రిక, అక్టోబర్ 03 2026)



భూపాలపల్లి జిల్లా బీజేపీ ఓబీసీ మోర్చా అధికార ప్రతినిధిగా మోత్కూరి సత్యనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ నాయకత్వం ఆయనను అధికారికంగా ఎంపిక చేసింది. పార్టీ బలోపేతానికి, ఓబీసీ వర్గాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న మోత్కూరి సత్యనారాయణ నియామకం పట్ల పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. తనకు బాధ్యతలు అప్పగించిన పార్టీ పెద్దలకు మరియు నాయకులకు ఈ సందర్భంగా మోత్కూరి సత్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ విజయానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు పూర్తి కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు.

**ఇర్సడ్ల వంశీకృష్ణ, స్టేట్ బ్యూరో చీఫ్ పవర్ దినపత్రిక**




## హిట్ కోసం శ్రీనిధి ఎదురుచూపులు



కన్నడ సోయగం శ్రీనిధి శెట్టి కెరీర్ ఆరంభం నుంచే ఆసక్తికరంగా సాగుతోంది. పాన్ ఇండియా సంచలనం కేజీఎఫ్ ఫ్రాంచైజీతో వెండి తెరకు పరిచయమైన ఈ భామ.. తొలి చిత్రంతోనే భారీ గుర్తింపు సొంతం చేసుకుంది. ఆ తర్వాత విక్రమ్‌తో కోబ్రా, నేచురల్ స్టార్ నానితో హిట్3 వంటి చిత్రాల్లో నటించినా.. ఆశించిన స్థాయిలో అవకాశాలు మాత్రం అందుకోలేకపోయింది. ఇప్పటికే భారీ చిత్రాల్లో భాగమైన శ్రీనిధి.. తన కెరీర్‌ను మరో మలుపు తిప్పే అవకాశం కోసం ఎదురుచూస్తోంది. ఈ క్రమంలో విక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో విక్టరీ వెంకటేష్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న `ఆదర్శ కుటుంబం`పై భారీ ఆశలు పెట్టుకుంది. పూర్తిస్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ సినిమాలో శ్రీనిధి.. వెంకటేష్ సరసన 'స్వర్ణ' అనే గృహిణి, తల్లి పాత్రలో కనిపించనుంది.

# రాజస్థానీ స్టైల్లో టాక్సిక్ బ్యూటీ

### తారా సుతారియా ఫ్యాషన్ షో



బాలీవుడ్ బ్యూటీ తారా సుతారియా తన ప్రత్యేకమైన ఫ్యాషన్ సెన్స్‌తో ఎప్పుడూ యువతను, ఫ్యాషన్ ప్రియులను ఆకట్టుకుంటుంటుంది. తాజాగా రాజస్థానీ వైబ్స్‌ను ప్రతిబింబించే సరికొత్త లుక్‌లో మెరిసి సోషల్ మీడియాలో సందడి చేస్తోంది. ట్రెడిషనల్, కంటెంపరరీ స్టైలింగ్‌ను మేళవించిన ఈ ఫోటోషూట్‌లో తారా అచ్చం రాజస్థానీ రాకుమారిలా కనిపించింది. హోలిచిక్ బై మేఘా, ఫ్యాషనేట్లీ పెర్నియా వంటి ప్రముఖ డిజైన్ లేబుల్స్ సహకారంతో రూపొందిన ఈ లుక్‌లో ఆమె అందం, గ్రేస్, ఎలిగెన్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రాజస్థానీ సంప్రదాయ శైలికి ఆధునిక ఫ్యాషన్ టచ్ జోడిస్తూ తారా ఇచ్చిన స్టైలిష్ పోజులు నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ప్రస్తుతం ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారగా.. అభిమానులు, ఫ్యాషన్ ప్రియుల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

### షర్ట్ స్టైల్‌లో అదరగొట్టిన హీరోయిన్

## బోల్డ్ లుక్‌లో ఐశ్వర్య రాజేష్

హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ తన సహజమైన అందం, వైవిధ్యమైన నటనతో తెలుగు, తమిళ ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు తెచ్చుకుంది. సినిమాల్లో పాత్రకు తగ్గట్టుగా విభిన్న లుక్స్‌లో కనిపించే ఈ భామ.. సోషల్ మీడియాలోనూ తన స్టైలిష్ ఫోటోషూట్లతో అభిమానులను ఆకట్టుకుంటుంటుంది. తాజాగా ఐశ్వర్య రాజేష్ షేర్ చేసిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. షర్ట్ స్టైల్ ఔట్‌ఫిట్‌లో కనిపించిన ఆమె.. బటన్‌డ్‌డౌన్ లుక్‌కు భిన్నంగా కొన్ని బటన్లు విప్పి బోల్డ్‌గా పోజులిచ్చింది. సింపుల్ స్టైలింగ్‌తోనే తన గ్లామర్‌ను హైలైట్ చేస్తూ ఫోటోలకు ఫోజులిచ్చింది. ఈ ఫోటోషూట్‌లో ఐశ్వర్య రాజేష్ కూల్, కాన్ఫిడెంట్ లుక్‌లో కనిపించింది. మినిమల్ మేకప్, సహజమైన హెయిర్‌స్టైల్‌తో తన అందాన్ని మరింత హైలైట్ చేసింది. సంప్రదాయ గ్లామర్‌కు భిన్నంగా స్టైలిష్ అటిట్యూడ్‌తో ఆమె ఇచ్చిన పోజులు నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే ఐశ్వర్య.. తరచూ తన వ్యక్తిగత, ప్రొఫెషనల్ విషయాలకు సంబంధించిన ఫోటోలను అభిమానులతో పంచుకుంటుంది. తాజాగా షేర్ చేసిన ఈ బోల్డ్ ఫోటోషూట్‌కు కూడా అభిమానుల నుంచి స్పందన వస్తోంది. ప్రస్తుతం ఈ పిక్స్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి.





- చీరకట్టులో వయ్యారాలు

## క్లాసీ లుక్‌లో అందాల రాశీ

ఊహలు గుసగుసలాడే చిత్రంలో 'ప్రభ' పాత్రతో క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో ఆకట్టుకున్న రాశీ ఖన్నా.. ఆ తర్వాత మనం సినిమాలో అతిథి పాత్రలో మెరిసి ప్రేక్షకుల దృష్టిని తనవైపు తిప్పుకుంది. వరుసగా స్టార్ హీరోల చిత్రాల్లో అవకాశాలు అందుకుంటూ టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. కొంతకాలంగా సినిమాల వేగం తగ్గించిన ఈ బ్యూటీ.. ఇప్పుడు మళ్లీ జోరు పెంచుతోంది. ఓవైపు సినిమాలు.. మరోవైపు ఈవెంట్లతో సందడి చేస్తోంది. తాజాగా తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేసిన ఫోటోలు సోషల్ మీడియాలో ఆకట్టుకుంటున్నాయి. ఈ ఫోటోషూట్‌లో రాశీ ఖన్నా చీరకట్టులో ఎంతో క్లాసీగా కనిపించింది. డిజైనర్ బ్రాండ్ 369కి చెందిన తెలుపు రంగు చీరను ధరించిన ఆమె.. నీలం రంగు అందమైన ప్రింట్లతో ఉన్న ఈ శారీలో మెరిసిపోయింది.

# ఓం విడుదల తేదీ ఖరారు

తమిళ స్టార్ హీరో ధనుష్, మలయాళ సూపర్‌స్టార్ మమ్ముట్టి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఓం'. దర్శకుడు రాజ్‌కుమార్ పెరియసామి తెరకెక్కిస్తున్న ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. ఈ ఏడాది నవంబర్ 20న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ధనుష్ సొంత నిర్మాణ సంస్థ వండర్‌బార్ ఫిల్మ్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. 'నిర్ణయాత్మకమైన దాడికి రోజు వచ్చేసింది. ఓం 2026 నవంబర్ 20న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలవుతోంది' అంటూ చిత్రబృందం సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది. తొలుత ఈ చిత్రాన్ని అక్టోబర్ 16న విడుదల చేయాలని భావించారు. అయితే, సూపర్‌స్టార్ రజనీకాంత్ నటిస్తున్న 'జైలర్ 2' అక్టోబర్ 15న విడుదల కానుండటంతో ఆ చిత్రానికి గౌరవం ఇస్తూ తమ సినిమాను వాయిదా వేస్తున్నట్లు ధనుష్ గతంలో ప్రకటించారు. అలాగే, సూర్య సినిమా కారణంగా దీపావళి బరిలోనూ నిలవడం లేదని స్పష్టం చేశారు. తాజాగా ప్రకటించిన తేదీతో విడుదలపై స్పష్టత వచ్చింది.




### భోజ్‌పురి మూవీలో సీతామహాలక్ష్మి



మృణాల్ ఠాకూర్ అంటే సీతారామం చిత్రంలోని సీతామహాలక్ష్మి పాత్రే ముందుగా గుర్తుకొస్తుంది. ఆ సినిమాతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న ఈ భామ.. ఆ తర్వాత గ్లామర్‌కు మాత్రమే పరిమితం కాకుండా నటనకు ప్రాధాన్యమున్న వైవిధ్యమైన కథలను ఎంచుకుంటూ దూసుకుపోతోంది. దక్షిణాదితో పాటు బాలీవుడ్‌లోనూ వరుస అవకాశాలు అందుకుంటున్న మృణాల్.. ఇప్పుడు భోజ్‌పురి చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టబోతోందనే వార్తలు సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతున్నాయి. భోజ్‌పురి నటుడు, లోక్‌సభ సభ్యుడు రవికిషన్‌తో కలిసి మృణాల్ ఓ ప్రాజెక్ట్‌లో నటించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే వీరిద్దరూ బట్లా హౌస్, సన్ ఆఫ్ సర్దార్ 2 చిత్రాల్లో కీలక పాత్రల్లో కలిసి నటించారు. ఆ పరిచయంతోనే ఓ బలమైన భోజ్‌పురి కథకు మృణాల్ సరిపోతుందని భావించి రవికిషన్ ఆమెను సంప్రదించినట్లు.. ఈ ఆఫర్‌కు మృణాల్ కూడా సానుకూలంగా స్పందించినట్లు టాక్ వినిపిస్తోంది. అయితే ఈ ప్రాజెక్ట్‌పై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.